కానరాని కిలకిలా రావాలు

- అంతరించిపోతున్న పిచ్చుకలు
- పర్యావరణ సమతుల్యతకు భంగమంటున్న పర్యావరణ వేత్తలు

మొగల్తూరు: పిచ్చుకల కిలకిలా రావాలు కనుమరుగవుతున్నాయి. సుమారు నాలుగు దశాబ్దాల క్రితం చైనాలో ఆదేశ పాలకుడు చేసిన తప్పుకు తదనంతర కాలంలో ఆ దేశం కరువు ముంగిట వాలింది. ప్రజల శ్రమ ఫలితమైన గింజలను తింటున్న పిచ్చుకలను నాశనం చేయాలని చైనా దేశ పాలకుడు ఆదేశించాడు. దీంతో ప్రజలు తప్పెట్లు, గిన్నెలను మోగించుకుంటూ తిరిగారు. పాపం పిచ్చుకలు ఆ శబ్దాల హోరు తట్టుకోలేక నేలకొరిగాయి. కొన్నేళ్లు గడిచి, అంతా బాగుంది అనుకునే లోపు మిడతల దండు విరుచుకు పడింది. గింజలు కాదు కదా అసలు పంటే లేకుండా చేశాయి ఆ మిడతలు. అంతే దేశంలోనే అతిపెద్ద కరువు సంభవించింది. దీంతో తాము చేసిన తప్పును గ్రహించిన పాలకులు పిచ్చుకల సంరక్షణకు చర్యలు చేపట్టారు. మన దేశంలోనూ ఇరవై ఏళ్ల క్రితం వరకు తన కిలకిలరావాలతో మేలుకొలుపు పాడిన పిచ్చుకలు ఇప్పుడు మచ్చుకైనా కనిపించడం లేదు. దశాబ్ద క్రితంతో పోలిస్తే 80 శాతం పిచ్చుకలు అంతరించిపోయాయని చెబుతున్నారు. తిండి లేక, గింజలు దొరక్క పిచ్చుకలు అంతరించిపోయేందుకు అనేక కారణాలున్నాయని చెబుతున్నారు. పట్టణాలు, గ్రామాల్లోనూ భవన నిర్మాణ శైలి మారిపోవడంతో వీటికి గూడు కరువైంది. పెరటి తోటలు తగ్గిపోవడం, మొబైల్ ఫోన్ టవర్ల రేడియో ధార్మికత, వ్యవసాయంలో రసాయన మందుల వాడకం ఎక్కువ అవడం, వాహనాల రణగొణ ధ్వనులను తట్టుకోలేక పోవడం పిచ్చుకలకు శాపంగా మారాయి.


ఆహారం కోసం ఓ మెస్‌పై వాలిన పిచ్చుకలు


రామన్నపాలెంలో ఓ రాయిపై వాలిన పిచ్చుక

మనిషికి దగ్గరగానే జీవితం

మానవ నాగరికతతో పాటే పిచ్చుకలు అభివృద్ధి చెందుతూ వచ్చాయి. అడవులు ఎన్ని ఉన్నా మానవ ఆవాసాలకు దగ్గరగానే ఉన్నాయి. భవనాల్లో ఉండే చిన్న చిన్న కంతల్లో, చీలికల్లో గూళ్లు ఏర్పరచుకోవడం, పొలాల దగ్గర నివాసముండేవి. అయితే అంతరించిపోతున్న పిచ్చుకలను పెంచి, వాటిని సంరక్షించేందుకు ప్రజలు అవగాహన పెంచుకోవాలని పలువురు కోరుతున్నారు.

పిచ్చుకలను సంరక్షించాలంటే

ఇళ్లలో పుష్పించే మొక్కల పెంపకం చేపట్టాలని, తద్వారా కీటకాలు ఆకర్షితమై పిచ్చుకలకు ఆహారం లభిస్తుందని, అక్కడక్కడా చిన్న చిన్న గూళ్ల ఏర్పాటు చేయడం, ధాన్యం పండించే రైతు ఇంటి ముంగిట వరి కుచ్చులు కట్టడం ద్వారా పిచ్చుకలను సంరక్షించవచ్చని సూచిస్తున్నారు.

క్లుప్తంగా

రక్తదానంతో ముగ్గురికి ప్రాణదానం


రక్తదానం చేస్తున్న ఎస్వీకేపీ వలంటీర్లు

పెనుగొండ: ఒకరి రక్తదానం ముగ్గురి నిండు ప్రాణాలను కాపాడుతుందని పెనుగొండ ఎస్వీకేపీ అండ్ డాక్టర్ కేఎస్ రాజు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వైవీవీ అప్పారావు అన్నారు. సోమవారం జాతీయ సేవా పథకం, రెడ్ రిబ్బన్ క్లబ్ సంయుక్తంగా పాలకొల్లు ఆపద్బంధు బ్లడ్ బ్యాంకుకు రక్తదానం చేశారు. ప్రస్తుత పరిస్థితుల్లో రక్తం చాలా అవసరమవుతుందన్నారు. డెంగ్యూ, టైఫాయిడ్, వైరల్ జ్వరాలతో ప్లేట్లెట్స్ తగ్గుతున్న తరుణంలో రక్తం అవసరమవుతుందన్నారు. కార్యక్రమంలో రెడ్ రిబ్బన్ క్లబ్ కన్వీనర్ టి.రమేష్, ఎన్ఎస్ఎస్ అధికారులు టి.దివాకర్, ఆర్ఎస్ శ్రీనివాస్, పి.మీరయ్య పాల్గొన్నారు.

గోదావరి వద్ద స్వచ్ఛతా హీ సేవ


కార్యక్రమంలో పాల్గొన్న ఎన్ఎస్ఎస్ విద్యార్థులు

నరసాపురం: పట్టణంలోని వశిష్ట గోదావరి గట్టు వద్ద సోమవారం పెన్నాడ భీమవరం ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ ఎన్ఎస్ఎస్ విద్యార్థులు స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమం నిర్వహించారు. గోదావరి గట్టు ప్రాంతాన్ని శుభ్రం చేశారు. బీజేపీ నియోజక వర్గ కన్వీనర్ మేక సతీష్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ కొప్పర్తి సురేష్, ఎన్ఎస్ఎస్ అధికారి ఏబీఎస్ఆర్ మనోహరి పాల్గొన్నారు.

ఆచంట తహసీల్దారుగా సోమేశ్వరరావు


ఎం.సోమేశ్వరరావు

పెనుగొండ: ఆచంట తహసీల్దారుగా ఎం.సోమేశ్వరరావు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. భీమవరంలో డిప్యూటీ తహసీల్దారుగా విధులు నిర్వహించారు. అక్కడి నుంచి బదిలీపై ఆచంటకు తహసీల్దారుగా పూర్తి బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా డిప్యూటీ తహసీల్దార్ డి.సుగుణ సంధ్య, కార్యాలయ సిబ్బంది అభినందనలు తెలిపారు.

సామూహిక సీమంతాలు


సామూహిక శ్రీమంతాలు చేస్తున్న సర్పంచ్ శ్యామలాసోనీ

పెనుగొండ: పౌష్టికాహార మాసోత్సవాల సందర్భంగా ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పెనుగొండ రైతుసేవా కేంద్రంలో సర్పంచ్ నక్కా శ్యామలాసోనీ శాస్త్రి గర్భిణులకు సామూహిక సీమంతాలు నిర్వహించారు. సోమవారం గర్భిణులకు, బాలింతలకు, కిషోర బాలికలకు, చిన్నారులకు పోషకాహార విశిష్టతను వివరించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజరు ఎం.విజయకుమారి, డ్వాక్రా సీసీ టి.శేషారత్నం, కార్యదర్శి టి.రత్నాకర్, అంగన్‌వాడీ వర్కర్లు పాల్గొన్నారు.

అక్రమ కట్టడాలను నిలుపుదల చేయాలి

వీరవాసరం: మండల కేంద్రమైన వీరవాసరంలో నిర్మిస్తున్న అక్రమ కట్టడాలను వెంటనే నిలుపుదల చేయాలని ఏపీ జన ప్రగతి సేవా సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు గొట్టుముక్కల ప్రభాకర్‌రావు సోమవారం డిమాండ్ చేశారు. వీరవాసరం తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తహసీల్దార్ కార్యాలయానికి కూత వేటు దూరంలో ఉన్న ట్యాంక్ పోరంబోకు స్థలంలో అక్రమ నిర్మాణం చేపడుతున్నారన్నారు. సంబంధిత శాఖ అధికారులు తక్షణమే స్పందించి ట్యాంక్ పోరంబోకులో నిర్మిస్తున్న భవనాలను నిలుపుదల చేయాలని కోరారు.

2న ఏపీటీఎఫ్ తరగతులు

భీమవరం: ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో అక్టోబర్ 2న జిల్లా ఉద్యమ అధ్యయన తరగతులు తాడేపల్లిగూడెంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్నట్లు ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జి.ప్రకాశం, బీవీ నారాయణ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ పరిస్థితులు-విద్యా రంగంపై ప్రభావం, విద్యారంగ సమస్యలు ఏపీటీఎఫ్ దృక్పథం-పని విధానం అనే అంశాలపై ఉపన్యాసాలు ఉంటాయన్నారు. ఈ సమావేశానికి వక్తలుగా రాష్ట్ర అధ్యక్షురాలు సీహెచ్ మంజుల, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.భానుమూర్తి, రాష్ట్ర పూర్వ ప్రధాన కార్యదర్శి పి.పాండు రంగ వర ప్రసాద్ హాజరవుతారని, ముఖ్య నాయకులు తప్పనిసరిగా హాజరుకావాలని కోరారు.

ఎక్సైజ్ సీఐగా రాంబాబు

నరసాపురం: నరసాపురం ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సీఐగా ఎస్.రాంబాబు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. తూర్పుగోదారి జిల్లా రాజోలు నుంచి ఆయన బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ కొత్త మద్యం పాలసీపై అక్టోబర్ 1 నుంచి 10 వరకూ నోటిఫికేషన్స్ ఉంటాయన్నారు. ఈ నెల 15 వరకూ ప్రభుత్వ మద్యం దుకాణాలు కొనసాగుతాయని చెప్పారు. నాటుసారా, అక్రమ మద్యాన్ని అరికడతామన్నారు.

ఎస్సైగా ఎస్.ఖాసీం

నరసాపురం ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఎస్సైగా ఎస్.ఖాసీం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఈయన పాలకొల్లు, తాడేపల్లిగూడెం ప్రాంతాల్లో పని చేశారు. తూర్పుగోదావరి జిల్లా నుంచి బదిలీపై ఇక్కడకు వచ్చారు.

యువకుడి ఆత్మహత్యాయత్నం

భీమవరం: పట్టణంలోని నర్సయ్య అగ్రహారానికి చెందిన మణికంఠ (30) లెప్రసీ కాలనీలో పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. స్థానికులు గమనించి అతడిని ప్రభుత్వాసుపత్రికి తరలించారు. సమాచారం అందుకున్న వన్‌టౌన్ పోలీసులు వివరాలు సేకరిస్తున్నారు. ఆత్మహత్యాయత్నానికి గల కారణాలు తెలియాల్సి ఉంది.

పైపులైన్ లీకేజీతో రోడ్డు ధ్వంసం


మంచినీటి పైపులైన్ లీకవుతున్న ప్రదేశంలో ధ్వంసమవుతున్న రోడ్డు


నక్కల డ్రెయిన్ వంతెనపై లీకవుతున్న మంచినీటి పైపులైన్

యలమంచిలి: కట్టుపాలెం పంచాయతీకి నారినమెరక పంచాయతీ గమళ్లపెంటలో మంచినీటి బోరు ఉంది. ప్రతి రోజూ ఉదయం, సాయంత్రం ఆ బోరు నుంచి కట్టుపాలెంలో ఉన్న మంచినీటి ట్యాంకులకు నీరు తోడి ప్రజలకు సరఫరా చేస్తారు. అయితే ఆ పైపులైన్ గత రెండు నెలలుగా నక్కల డ్రెయిన్ వంతెనపై లీకవుతుంది. మరమ్మతులు చేస్తున్నా లీకేజీ ఆగడం లేదు. ఈ వంతెన మీద నుంచి సుమారు 20 గ్రామాల ప్రజలు నిత్యం తమ వాహనాలపై రాకపోకలు సాగిస్తుంటారు. భారీ వాహనాలు సైతం తిరుగుతుంటాయి. దీంతో వాహనాల తాకిడి వలన ఆ ప్రదేశంలో తారురోడ్డు సైతం దెబ్బతింటుంది. విలువైన మంచినీరు వృథా కావడమే కాకుండా, రోడ్డు దెబ్బతింటున్నా పూర్తి స్థాయిలో మరమ్మతులు చేయకపోవడంపై గ్రామస్తులతో పాటు వాహన చోదకులు నిరసన వ్యక్తం చేస్తున్నారు. పైగా నిత్యం ఆ ప్రదేశంలో నీరు నిల్వ ఉండటంతో దోమల బెడద పెరిగిందని వంతెన సమీపంలో ఉన్న దుకాణదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ మద్రిపూడి సురేష్‌బాబును వివరణ కోరగా ఈ సమస్య తన దృష్టికి వచ్చిందన్నారు. పంచాయతీ కార్యదర్శికి వెంటనే మరమ్మతులు చేయాలని ఆదేశాలిచ్చినట్లు తెలిపారు.

సామూహిక ఎలుకల నిర్మూలన చేపట్టాలి


వడలిలో ఎలుకల మందు పంపిణీ చేస్తున్న సర్పంచ్ విజయలక్ష్మి

పెనుగొండ: ఎలుకల ఉధృతి దిగుబడులపై ప్రభావం చూపుతుందని, రైతులు సామూహిక ఎలుకల నిర్మూలనకు చర్యలు చేపట్టాలని వడలి సర్పంచ్ కాసాని విజయలక్ష్మి పెద్దిరాజు అన్నారు. సోమవారం వడలి పంచాయతీ వద్ద వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ఎలుకల మందు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వ్యవసాయయ సహాయకులు యార్లగడ్డ వర్మ, సత్తి నాగ సూర్య ప్రసాదరెడ్డి, కార్యదర్శి పీపీ రామకృష్ణ, ఉప్పలపాటి చంటి, మేకా శివయ్య, అంగర్ వర ప్రసాద్ పాల్గొన్నారు.

అవగాహన ర్యాలీ

స్వచ్ఛతా హీ సేవ-2024లో భాగంగా వడలి సర్పంచ్ కాసాని విజయలక్ష్మి పెద్దిరాజు ఆధ్వర్యంలో విద్యార్థులు ప్లాస్టిక్ నిషేధం, తడి చెత్త, పొడి చెత్త సేకరణ, పరిసరాల పరిశుభ్రతలపై సోమవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో డ్వాక్రా మహిళలు, పంచాయతీ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం ఎంపిక


నూతనంగా ఎన్నికైన దేవాంగ సంక్షేమ సంఘు కార్యవర్గం

పాలకొల్లు సెంట్రల్: పట్టణ దేవాంగ సంక్షేమ సంఘ సభ్యులు నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. సోమవారం స్థానిక వీవర్స్ కాలనీలో వీవర్స్ కమ్యూనిటీ హాలు నందు జనరల్ బాడీ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా అధ్యక్షులుగా కూర్మా శివగణేష్, సెక్రటరీ మానెం బసవరాజు, ట్రెజరర్ యర్రా శివాజీలతో పాటు కార్యవర్గ సభ్యులను ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు శివ గణేష్ మాట్లాడుతూ సంఘం నూతన కమిటీ సభ్యులతో కలిసి సంఘ అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. అలాగే పేదవారికి విద్య, వైద్య పరంగా ఆర్థిక సహాయం అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో దేవాంగ సంక్షేమ సంఘ సభ్యులు పాల్గొన్నారు.

మెప్మాలో అవకతవకల రచ్చ


చికిత్స పొందుతున్న సత్యనారాయణ

నరసాపురం: మున్సిపల్ మెప్మా సెక్షన్‌లో లొసుగులు మళ్లీ పురుడు పోసుకుంటున్నాయి. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో అనునిత్యం వివాదాలతో నడిచిన మెప్మా వ్యవహారాలు, వైఎస్సార్‌సీపీ పాలనలో కుదుటపడ్డాయి. అప్పటిలో వివాదాలకు కేంద్ర బిందువుగా పేరు గడించిన కమ్యూనిటీ ఆర్గనైజర్ సత్యనారాయణను గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వలో బదిలీ చేసి మెప్మాసెక్షన్ వ్యవహారాలను ప్రక్షాళన చేశారు. ప్రభుత్వం మారిన వెంటనే మళ్లీ స్థానికంగా విధుల్లోకి వచ్చిన సత్యనారాయణపై గత వివాదాల తాలూకా అంశాలు కొన్ని రోజులుగా రచ్చ రేపుతున్నాయి. ఈ నేపథ్యంలో సోమవారం ఇద్దరు ఆర్పీలు, వారి బంధువులు కొందరు తనపై దాడి చేశారని సత్యనారాయణ ప్రభుత్వ ఆసుపత్రిలో చేరారు. ఆర్పీలు మల్లాడి లక్ష్మి, దుర్గా భవానీపై పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ ఆర్పీలు ఇద్దరు నకిలీ డ్వాక్రా సభ్యుల పేర్లు సృష్టించి, రూ.20 లక్షలు రుణం తీసుకున్నారని, రికవరీ కోసం అడిగితే మధ్యాహ్నం 3వ వార్డు అంబేడ్కర్ భవన్‌లో జరిగిన డ్వాక్రా సమావేశంలో బంధువులను తీసుకొచ్చి దాడి చేశారని ఫిర్యాదు చేశాడు. అయితే ఆర్పీలు ఈ విషయాన్ని ఖండిస్తున్నారు. సత్యనారాయణ విధుల్లోకి వచ్చిన రోజు నుంచి వేధిస్తున్నాడని, ఉద్యోగాల నుంచి తీయించేస్తానని బెదిరిస్తున్నాడని చెబుతున్నారు. చాలా అనుచితంగా కూడా మాట్లాడుతున్నాడని పేర్కొన్నారు. దాడి చేయలేదని తాము కూడా పోలీసులకు ఫిర్యాదు చేస్తామని చెప్పారు.

తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ వహించాలి


విద్యార్థులకు ప్రోగ్రెస్ కార్డులు అందజేస్తున్న హెచ్ఎం

పాలకొల్లు సెంట్రల్: విద్యార్థులు పాఠశాల నుంచి ఇంటికి వచ్చిన తరువాత తల్లిదండ్రులు వారిపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రాయపూడి భవానీ ప్రసాద్ అన్నారు. సోమవారం స్థానిక జీవీఎస్‌వీఆర్ఎం మునిసిపల్ ప్రాథమిక పాఠశాలలో స్వచ్ఛతా హీ సేవ, ఉపాధ్యాయుల హాజరు, పాఠ్యాంశాలపై పేరెంట్స్ కమిటీ సమావేశం నిర్వహించారు. సమావేశం అనంతరం విద్యార్థులకు ప్రగతి పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులతో పాటు తల్లిదండ్రులు పాల్గొన్నారు.

కొత్త మద్యం పాలసీకి వ్యతిరేకం

ఆకివీడు: కొత్త మద్యం పాలసీకి సీపీఎం వ్యతిరేకమని సీపీఎం జిల్లా కార్యదర్శి జెఎన్వీ.గోపాలన్ చెప్పారు. స్థానిక 14వ వార్డుల్లో సీపీఎం జెండాను ఎగురవేసి పార్టీ సమావేశాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మద్యం షాపులు పెంపు, సమయం పెంపు, బెల్టు షాపుల ఏర్పాటు వంటివాటికి తమ పార్టీ వ్యతిరేకించి ఉద్యమిస్తామని చెప్పారు. పాత విధానాల్నే కొనసాగించాలని డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వం హామీల అమలుపై దృష్టి సారించాలని కోరారు. అనంతరం శాఖ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. కార్యదర్శిగా సందక సూర్యకుమారి, ఏడుగురు సభ్యులతో కమిటీ ఏర్పడింది. కార్యక్రమంలో పట్టణ కార్యదర్శి కె.తవిటినాయుడు, డోకల లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పని చేయని సర్వర్.. రేషన్ డీలర్ల అవస్థ


ఉండి ఎమ్ఎల్ఎస్ పాయింట్ వద్ద సర్వర్ పని చేయకపోవడంతో వేచి ఉన్న రేషన్ డీలర్లు

పాలకోడేరు: ఉండి ఎంఎల్ఎస్ పాయింట్ వద్ద ఈ పోస్ మిషన్ సర్వర్ నాలుగు రోజులుగా పని చేయడం లేదు. దీంతో వేలిముద్ర వేయడానికి వచ్చిన డీలర్లు గంటల తరబడి వేచి ఉండి, ఉసూరుమంటూ తిరిగి వెళ్తున్నారు. ఈ గోదాముల పరిధిలో ఆరు మండలాలు ఉన్నాయి. ఉండి, కాళ్ల, ఆకివీడు, భీమవరం రూరల్, అర్బన్, పాలకోడేరు మండలాల నుంచి వేలిముద్రలు వేసేందుకు ఇక్కడికి వస్తున్నారు. సుదూర ప్రాంతాల నుంచి ఇక్కడకు వస్తే సర్వర్ పని చేయడం లేదని వార్త విని ఇబ్బందులు పడుతూ ఇంటి బాట పడుతున్నారు. పీడీఎస్ రైస్‌కు ఒకసారి, ఐసీడీఎస్ సరుకులకు ఒక సారి, మధ్యాహ్న భోజన పథకం బియ్యానికి ఒక సారి ఇలా ప్రతి నెలా మూడు సార్లు గోదాముకు వచ్చి వేలిముద్రలు వేయాల్సి వస్తోందని, అయినా మాకు రావలసిన కమిషన్ కొంత కాలంగా ఇవ్వడం లేదని రేషన్ డీలర్లు వాపోతున్నారు.

బస్సు, కారు ఢీకొన్న ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

పాలకోడేరు: పెనుగొండ గ్రామానికి చెందిన విప్పర్ల వెంకట సత్యనారాయణ చిన్న అమిరంలో తన కుటుంబ సభ్యులతో కలిసి కారులో పెద్ద కొడుకు ఇంటికి వెళ్లి తిరిగి వస్తుండగా సోమవారం ఉదయం వేండ్ర డెల్టా పేపర్ మిల్లు సమీపంలో వంతెన వద్ద ఎదురుగా వస్తున్న ప్రైవేటు కళాశాల బస్సును వేగంగా ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న సత్యనారాయణ కాలికి తీవ్ర గాయమైంది. చిన్న కొడుకు, కోడలికి గాయాలయ్యాయి. బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఎన్ హరిబాబు తెలిపారు.

స్పందనకు సమస్యలపై రెండు అర్జీలు

ఆకివీడు: ప్రజా సమస్యల పరిష్కారానికి సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన స్పందనలో రెండు ఫిర్యాదులు అందినట్లు ఇన్‌చార్జి ఎంపీడీఓ సుబ్బారావు చెప్పారు. మండలంలోని దుంపగడప గ్రామంలోని మంచినీటి పంట కాలులకు చేర్చి నిబంధనలకు విరుద్ధంగా ఆక్వా చెరువు తవ్వి రొయ్యల చెరువు సాగు చేస్తున్నారని గ్రామానికి చెందిన సూరంపూడి వెంకట రాంబాబు అర్జీ అందజేశారు. తన సర్వీస్ రిజిస్టర్‌లో జాయినింగ్ తేదీని తప్పు రాశారని, 2010లో మెడికల్ లీవు అప్పటి తహసీల్దార్ నమోదు చేశారని, దీనివల్ల సీనియర్ సహాయకుడిగా పదోన్నతి అవకాశం కోల్పోయానని న్యాయం చేయాలని కోరుతూ గుమ్ములూరు-2 రెవెన్యూ అధికారి బందా హరిచ్చంద్ర ప్రసాద్ అర్జీ చేసినట్లు ఎంపీడీఓ తెలిపారు.

చీటింగ్ కేసు నమోదు

భీమవరం: ఒక వ్యక్తి తన సోదరుడికి ఉద్యోగం ఇప్పిస్తానని నమ్మించి డబ్బు తీసుకొని మోసం చేశాడంటూ భీమవరం 39వ వార్డుకు చెందిన మహిళ టూటౌన్ పోలీసులకు సోమవారం ఫిర్యాదు చేశారు. హైదరాబాద్‌కు చెందిన పెద్దికృష్ణ మోహన్ అనే వ్యక్తికి భీమవరానికి చెందిన మహిళకు చిన్ననాటి నుంచి పరిచయం ఉంది. దీంతో కృష్ణమోహన్ ఇన్‌స్టాగామ్ ద్వారా ఆమెతో మాట్లాడడం ప్రారంభించాడు. అది నమ్మిన మహిళ తన సోదరుడికి ఉద్యోగం కావాలని చెప్పడంతో ఇప్పిస్తానని చెప్పి రెండు దఫాలుగా రూ.1.08 లక్షలు తీసుకున్నాడు. ఉద్యోగం ఇప్పించకపోవడంతో ఆ మహిళ కృష్ణమోహన్‌ను నిలదీసింది. కృష్ణమోహన్ డబ్బు ఇవ్వనని చెప్పడమే కాకుండా ఆ మహిళ కుటుంబ సభ్యులకు ఫోన్ చేసి బెదిరించాడని పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై రెహమాన్ తెలిపారు.

రుణాలు సక్రమంగా చెల్లించాలి

మొగల్తూరు: రైతులు తీసుకున్న రుణాలను సక్రమంగా చెల్లించి సంఘ అభివృద్ధికి సహకరించాలని ఆఫీసియల్ పర్సన్ ఇన్‌చార్జి ఆర్.నరేంద్ర కుమార్ సూచించారు. మొగల్తూరు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన మహాజన సభలో ఆయన మాట్లాడారు. తమ సంఘం ద్వారా రైతులకు కావలసిన ఎరువులు, పురుగు మందులు అందిస్తున్నామన్నారు. ఈ సందర్భంగా 2023-24 ఆడిట్ రిపోర్టును, జమా ఖర్చులను ఆమోదించారు. 2023-24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి రూ.28.18 లక్షలు నికర ఆదాయం లభించిందన్నారు. గత ఆరు నెలల కాలంలో సుమారు 56 మంది రైతులు బయటకు వెళ్లిపోగా, నూతనంగా 18 మంది రైతులు సభ్యత్వం తీసుకున్నారన్నారు. సమావేశంలో సొసైటీ కార్యదర్శి కొత్తపల్లి గోవింద్, నాయకులు తారక రామారావు, గట్టెం శ్రీను, గుత్తుల గాంధీ, బస్వాని ఏడుకొండలు, కత్తు సత్తిబాబు, తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ నేతకు పరామర్శ


వైఎస్సార్‌సీపీ నాయకుడు రామలింగేశ్వర రెడ్డి కుటుంబాన్ని పరామర్శిస్తున్న కిషోర్

పెనుమంట్ర: వైఎస్సార్‌సీపీ నాయకుడు కర్రి రామలింగేశ్వరరెడ్డి కుటుంబాన్ని వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు వైట్ల కిషోర్‌కుమార్ పరామర్శించారు. రామలింగేశ్వర రెడ్డి సతీమణి కర్రి సాయి వెంకట లక్ష్మీ కాంతం ఇటీవల మృతి చెందారు. ఆమె చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బండి మహేష్, శీలం చిట్టియ్య, చామన శ్రీనివాస్, ప్రశాంత్ పాల్గొన్నారు.

అర్జీల పరిష్కారానికి తక్షణ చర్యలు


ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న ఆర్డీవో దాసి రాజు

నరసాపురం: ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదుల అర్జీల పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకోవాలని నరసాపురం ఆర్డీవో దాసి రాజు అధికారులను ఆదేశించారు. సబ్ కలెక్టర్ కార్యాలయంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల వ్యవస్థ కార్యక్రమాన్ని ఆర్డీవో నిర్వహించారు. డివిజన్‌లోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు ఫిర్యాదులు, దరఖాస్తులు అందించారు. మొత్తం 27 ఫిర్యాదులు అందాయని ఆర్డీవో తెలిపారు. సంబంధిత అధికారులు సమస్యలు వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ కొత్తగా బాధ్యతలు చేపట్టిన తాను ప్రజా ఫిర్యాదుల వ్యవస్థ కార్యక్రమానికి అధిక ప్రాధాన్యత ఇస్తానన్నారు. కార్యక్రమంలో డివిజన్‌లోని వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

విద్యుత్ షాక్‌తో వ్యక్తి మృతి

యలమంచిలి: దొడ్డిపట్ల గ్రామానికి చెందిన కొండేటి రామారావు (51) సోమవారం విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందినట్లు ఎస్సై కర్టీడి గురయ్య తెలిపారు. రామారావు తన ఇంటి ఆవరణలో ఉన్న విద్యుత్తు మోటారు స్విచ్ వేసి వస్తుండగా విద్యుత్తు మోటారు వైరుపై కొబ్బరి ఆకు పడింది. దీంతో మోటారు వైరు తెగి రామారావుపై పడింది. విద్యుత్ షాక్ తగలడంతో రామారావు అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ మేరకు మృతుడి కుమారుడు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.